ప్రజాశక్తి
శుక్రవారం 2 డిసెంబర్ 2022 5
పార్వతీపురం మన్యం

రైతులకే రవాణా, గోనె సంచుల ధర చెల్లింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేందుకు రైతులకు రవాణా, గోనె సంచుల ధరలను చెల్లించేందుకు నిర్ణయించినట్లు జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం రవాణా అంశాన్ని కాంట్రాక్టర్లకు అప్పగించామని, రైతులు తమ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తీసుకొచ్చేందుకు రవాణా చార్జీలు భరిస్తే దీన్ని చెల్లిస్తామని పేర్కొన్నారు. 8 కిలో మీటర్ల వరకు రూ.295 స్లాబ్ ధర చెల్లిస్తామన్నారు. 8 నుండి 20 కిలో మీటర్ల వరకు కిలోమీటరుకు రూ.7 , 20 నుండి 40 కిలో మీటర్ల వరకు కిలోమీటరుకు రూ.6.50, 40 నుండి 80 కిలో మీటర్ల వరకు కిలోమీటరుకు రూ.6, 80 కిలో మీటర్ల పైబడి కిలోమీటరుకు రూ.5.50 చెల్లించనున్నట్లు వివరించారు. అలాగే 40 కిలోల సామర్థ్యం గల గోనె సంచికి రూ.3.39 చెల్లించనున్నట్లు తెలిపారు. రవాణా, గోనె సంచుల ధరలను మద్దతు ధరతో పాటు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఆయన చెప్పారు.

మలుపు తిరుగుతున్న కురుకుట్టి వ్యవహారం

- కలెక్టర్‌పై వైసిపి అగ్రనేత ఒత్తిడి!
- హెచ్‌ఎంపై చర్యలకు వెనుకాడుతున్న వైనం
- వార్డెన్ బాధ్యతల నుంచి మంజు తొలగింపు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో లైంగిక వేధింపులకు సంబంధించిన వ్యవహారం సుడిమలుపులు తిరుగుతోంది. గడచిన రెండు నెలలుగా ఈ వ్యవహారాన్ని అధికారపార్టీ నాయకులు, అధికారులు రకరకాలుగా మలుపులు తిప్పుతున్నారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న హెచ్‌ఎం కృష్ణారావుపై చర్యలు తీసుకోకుండా వైసిపి అగ్రనేత హుకుం జారీ చేయడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారనే చర్చ సర్వత్రా సాగుతోంది. గతనెల 5న పార్వతీపురం ఆర్‌డిఒ హేమలత నేతృత్వంలో ముగ్గురు మహిళా అధికారులతో కూడిన కమిటీ పాఠశాలలో విచారణ చేపట్టింది. అంతకుముందు సెప్టెంబర్ 17న ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఆయన విచారణపై గిరిజన సంఘాలు అనుమానాలు వ్యక్తం చేయడంతో కలెక్టర్ నిశాంత్ కుమార్ రెండో విడత విచారణకు ఆదేశించారు. అది కూడా పూర్తయింది. నివేదికను ఆర్డీవో హేమలత నేతృత్వంలోని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్ హెచ్‌ఎం కృష్ణారావుపై పోక్సో కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదై 15రోజులైనా ఇంత వరకూ చర్యలు తీసుకోక పోవడంపై గిరిజన సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆర్‌డిఒ స్థాయి అధికారి విచారణ నివేదిక ఆధారంగా హెచ్‌ఎంపై పోక్సో కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారంటే లైంగిక వేధింపులు నిజమేనన్న విషయం తేట తెల్లమైంది. అయినా కలెక్టర్ శాఖాపరమైన చర్యలకు వెనుకాడుతుండడం చర్చనీయాంశమవుతోంది. అధికారపార్టీ అగ్రనేత ఒత్తిడి కారణంగానే కలెక్టర్ చర్యలు తీసుకోవడం లేదని చర్చ సర్వత్రా సాగుతోంది. ఇదిలా వుండగా ఈ వ్యవహారాన్ని హెచ్‌ఎంకు అనుకూలంగా మార్చడానికి స్థానిక వైసిపి నాయకులు, కురుకుట్టి గ్రామపెద్దలు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా వారు కలెక్టర్‌కు పాఠశాల వార్డెన్ మంజుపై ఫిర్యాదు చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటే వార్డెన్ మంజుపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. కొంతమంది గిరిజన బాలికలచేత కూడా కలెక్టర్‌కు వార్డెన్ పై ఫిర్యాదు చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వార్డెన్ బాధ్యతల నుంచి మంజును తప్పించి ఇంకొకర్ని నియమించినట్లు అధికారులు చెబుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్న హెచ్‌ఎం కృష్ణారావును కాపాడేందుకు అధికారులు నడుపుతున్న డ్రామా రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ వ్యవహారంలో హెచ్‌ఎం కృష్ణారావు తప్పు లేదనే విషయం విద్యార్థినిల నుంచి రాబట్టడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో జిల్లా అధికారుల ఉదాసీనతపై గిరిజన సంఘాలు గుర్రుగా వున్నాయి.

కలెక్టర్ వద్ద పెండింగ్

గిరిజన సంక్షేమ డిడి సూర్యనారాయణ

కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల లైంగిక వేధింపులకు సంబంధించిన అంశంపై ఆర్డీవో హేమలత ఆధ్వర్యాన ముగ్గురు మహిళా అధికారుల విచారణ నివేదిక అందింది. దీని ఆధారంగానే కలెక్టర్ పోక్సో కేసు నమోదు చేయాలని ఆదేశించారు. హెచ్‌ఎం కృష్ణారావు ప్యానల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయులైనందున ఆయనపై చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్‌కే వుంటుంది. ఆయన వద్ద ఫైలు పెండింగ్‌లో వుంది. కురుకుట్టి పాఠశాల వార్డెన్ బాధ్యతల నుంచి మంజును తప్పించాం. హెచ్‌ఎంగా కూడా ఉండనని ఆమె చెప్పారు. త్వరలో నిర్ణయం తీసుకుంటాం.

ధాన్యం కొనుగోలు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పుట్టూరు, డిబ్బగుడివలస, ఎల్‌ఆర్ పేటలో గురువారం రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఆర్‌బికె సిబ్బంది, వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న ధాన్యం తేమశాతం పరీక్షలను దగ్గరుండి పరిశీలించారు. మద్దతు ధర పొందడానికి నిర్దేశిత తేమశాతంతో పాటు ధాన్యంలో నాణ్యత ఉండాలన్నారు. రైతులు మెరుగైన ధరను పొందడానికి వారికి పూర్తిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ సిబ్బంది, ఆర్‌బికె సహాయకులు తీసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన సంచులు అందించాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రేఖ తదితరులు ఉన్నారు.

పుట్టూరులో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కొమరాడ : మండలంలోని ఆర్తాంలో జాయింట్ కలెక్టర్ జె.ఆనంద్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు, రవాణా, నాణ్యత, తేమ పరీక్షలు నిర్వహణ, సిబ్బంది లభ్యత తదితర అంశాలను వివరంగా పరిశీలించారు. అందులో సమస్యలు, నివారణకు ఏవిధంగా చర్యలు చేపట్టాలన్న అంశాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 306 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ఎ,బి,సి కేటగిరీల్లో 188 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఇందులో పిఎసిల ఆధ్వర్యంలో 106, గిరి వెలుగు ఆధ్వర్యంలో 12, జిసిసి ఆధ్వర్యంలో 19, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 4, రైతు ఉత్పాదక సంఘం (ఎఫ్.పి.ఒ) ఆధ్వర్యంలో 47 ఉన్నాయని తెలిపారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యతా ప్రమాణాలు చూసే పరికరాలను సరఫరా చేశామని చెప్పారు. రవాణా, హమాలీలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం. దేవుళ్ల నాయక్, వ్యవసాయ ఎడి వెంకటేష్, వ్యవసాయ అధికారి రేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్తాంలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జెసి ఆనంద్

సీతానగరం : మండలంలోని మరిపివలస ఆర్‌బికెను జెసి సందర్శించి రైతుల నుంచి ధాన్యం నాణ్యతా పరీక్ష, కళ్లాల నుంచి తీసుకొన్న నాణ్యతా ప్రమాణాలను టెక్నికల్ అసిస్టెంట్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఏ విధంగా చేస్తున్నారని దగ్గరుండి పరీక్షించారు. అనంతరం బుడ్డిపేటలో రాసి పోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులు బాగా గాలి పట్టి ధాన్యాలను ఆర్‌బికెలకు పంపాలన్నారు. అలాగే గ్రామంలోని వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకుంటే అందులోనే ధాన్యాలను పంపించి ఆ పైకాన్ని రైతుఖాతాలో వేస్తారని తెలిపారు. అనంతరం చెరకు రైతుల వద్దకు వెళ్లి మధ్యవర్తులు, దళారులకు ద్వారా తరలించకుండా నేరుగా సుగర్ ఫ్యాక్టరీకు అమ్మాలని తెలిపారు. ధాన్యం ఖచ్చితంగా నాణ్యతా పరీక్షలు చేసి మిల్లులకు పంపాలని గ్రామ వ్యవసాయ సహాయకులుకు సూచించారు. కార్యక్రమంలో ఎఒ అవినాష్ , రైతులు, వివిఎలు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

తక్షణమే ధాన్యం కొనాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

తక్షణమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించి దళారులు, మిల్లర్ల నుంచి రైతులను కాపాడాలని అఖిలపక్ష నాయకులు కోరారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే వరినూర్పులైన రైతులు ధాన్యం అమ్ముకోలేక అనేక అవస్థలుపడుతున్నారన్నారు. తక్షణమే ఆర్‌బికెల్లో కొనుగోళ్లు ప్రారంభించి, రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యంలో ఈనెల 5న కలెక్టర్‌కు వినతిని ఇవ్వాలని, అనంతరం పరిస్థితిని సమీక్షించి ఈనెల 15న కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేయాలని తీర్మానించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బి.చిరంజీవులు (టిడిపి), రెడ్డి వేణు (సిపిఎం), కె.మన్మధరావు (సిపిఐ), బంటు దాసు (రైతుసంఘం), బాషా (రైతుకూలీ సంఘం) తదితరులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల3,4 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర స్థాయి అధికారులు రీ సర్వే, ఓటరు నమోదు కార్యక్రమం, ఎంపిఎఫ్‌సి (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గోడౌన్ల నిర్మాణం అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనరు ఎహెచ్ నితీష్ వ్యాస్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సి.ఇ.ఓ) ముఖేష్ కుమార్ మీనా ఓటర్ల నమోదు, సవరణలపై సమీక్ష నిర్వహించారు. 2023 నాటికి 18 ఏళ్లు నిండుతున్న యువత ఓటరుగా నమోదు చేయాలని తెలిపారు. కాలేజీ చదువుతున్న యువతను ఓటరుగా చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూపరిపాలన ప్రధాన కార్యదర్శి, జి.సాయిప్రసాద్ హక్కు పత్రాల జారీ, జగనన్న శాశ్వత భూ హక్కుకు సంబంధించిన రీ సర్వే, వివాద స్థలాలపై చర్యలు, మ్యుటేషన్లపై జిల్లా కలెక్టర్లుతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రీసర్వే పనులను వచ్చే ఫిబ్రవరి నాటికి ఫ్లైయింగ్ పూర్తి చేయాలన్నారు. రీ సర్వే అనంతరం కొలత రాళ్ల పని పూర్తిచేయాలన్నారు. సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు సమీక్ష నిర్వహిస్తూ రాష్ట్రంలో ఫేజ్ -3 కింద నిర్మించనున్న 140 ఎంపిఎఫ్‌సి (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గోడౌన్ల లక్ష్యాలను సాధించాలని సంయుక్త కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎం.పి.ఎఫ్.సి, బిఎంసియు (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్స్), ఎఎంసియు (ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్స్) నిర్మాణాలపై సంయుక్త కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జెసి ఒ.ఆనంద్, సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు బి.నవ్య, పి.విష్ణుచరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, పాలకొండ సబ్-కలెక్టరు నూరుల్ కమర్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లాలో కొత్తగా ఓటర్లు నమోదు చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించి పెద్ద ఎత్తున యువతను ఓటర్లుగా చేర్చాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ కోరారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఐటిడిఎ పిఒలు, సబ్‌కలెక్టర్, డిఆర్‌ఒ

గురువారం తన కార్యాలయ సమావేశమందిరంలో ఓటర్ల నమోదు కార్యక్రమంపై రాజకీయపార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటరుగా నమోదు చేసుకొనేందుకు అవకాశం గల యువత 21వేల మంది ఉన్నారని, వారిలో వేయిమంది మాత్రమే ఓటరుగా నమోదుకు దరఖాస్తు చేసుకొన్నారని, మిగిలిన 21వేల మందిని కూడా ఓటరుగా నమోదు చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఓటరు జాబితాలో పేరు తప్పుల సవరణకు, నమోదుకు, తొలగింపులకు ఫారం 6,7,8 అందజేయాలన్నారు. విద్యార్థుల కొరకు ఈ నెల 3,4 తేదీల్లో కళాశాలలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే లిఖితపూర్వకంగా తెలియజేస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. డిఆర్‌ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు ఈనెల 9వరకు గడువు ఉందని, మార్పులు, చేర్పులు, నమోదుకొరకు ఫారం 6,7,8 ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సక్రమంగా మెనూ అమలు : డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

మెనూ సక్రంగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ సిబ్బందిని ఆదేశించారు. మండలం రేగులపాడులోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యా బోధనపై ఆరా తీశారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. ఆయనతో పాటు ఎస్‌ఒ ఎస్.రోహిణి, సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు గొర్లి వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక పార్వతీదేవి ఆలయంలో జరుగుతున్న కార్పెంటర్స్ యూనియన్ సమావేశం, శ్రీ సీతారామస్వామి కోవెలలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కారం కోసం జరుగు సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పెంటర్ సంఘ అధ్యక్షులు కొండూరు రామగౌరి, ప్రధాన కార్యదర్శి పొడుగు గౌరీశంకర్, ఉపాధ్యక్షులు చింతాడ కిరణ్, సహాయ కార్యదర్శి దివిటి తిరుపతి, కోశాధికారి కట్టోజు గౌరీశంకర్, చిట్టూరు ఉమా, మరడాన సత్యం నాయుడు, మరిశర్ల రమేష్, హనుమంతు రాము, అంది వెంకటరమణను పాల్గొన్నారు.

ఖాళీ ప్లేట్లతోఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

వేతనాలు చెల్లించాలని

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

గ్రీన్ అంబాసిడర్లకు పదినెలలుగా బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఖాళీ ప్లేట్లతో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుంచి భిక్షాటనంతో నిరసన తెలుపుతూ ఎంపిడిఒ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ పది నెలలుగా జీతాల్లేక కుటుంబాలతో పస్తులున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్లు వేకువజామున చెత్త సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని, బ్లీచింగ్, దోమలు మందులాంటివి పిచికారీ చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న వీరికి భద్రత లేకపోవడం దారుణమన్నారు. అనంతరం ధర్నా వద్దకు ఎంపిడిఒ వచ్చి ఈనెల 6లోగా జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు ధర్నాలో గ్రీన్ అంబాసిడర్లు శ్రీనివాసరావు, ఫకీరు, ప్రసాదు, సోములు, దాసు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సబ్బులు, నూనెలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు రెండేళ్లుగా సబ్బులు, నూనెలు పంపిణీ చేయడం లేదని, సాధారణ నిధి నుంచి కొనుగోలు చేసి పంపిణీ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. గురువారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్వై నాయుడు ఆధ్వర్యాన కార్మికులు రాజన్నదొరను ఆయన నివాసం లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు లేవనే సాకుతో రెండేళ్లుగా పారిశుధ్య కార్మికులు 91మందికి సబ్బులు, నూనెలు పంపిణీ చేయడం లేదని చెప్పారు. ప్రజా ఆరోగ్య రక్షణ ధ్యేయంగా నిత్యం పారిశుద్ధ్య నిర్వహణకు పనిచేస్తున్న కార్మికులకు సబ్బులు, నూనెలు పంపిణీ చేయకపోవడం అన్యాయమని అన్నారు. కడప, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ల్లో కార్మికుల సబ్బులు నూనెలు కొనుగోలుకు సాధారణ నిధి నుంచి మంజూరు చేస్తున్నారని, అలాగే ఇక్కడ కూడా కొనుగోలు చేసి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ నాయకులు టి.రాముడు, టి.శంకరరావు, శ్రామిక మహిళా కన్వీనర్ టి.ఇందు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, ఎమ్మెల్సీల అరెస్టు అక్రమం

ప్రజాశక్తి - పాచిపెంట

సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న ఉపాధ్యాయులను, వారికి మద్దతుగా నిలిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలను ప్రభుత్వం అరెస్టులు చేయడం దుర్మార్గమని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వర రావు అన్నారు. అక్రమంగా అరెస్టులకు నిరసనగా మండలంలోని అమ్మవలస వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాల్ని ఉక్కుపాదంతో అణిచివేస్తుందని, రాజ్యాంగాన్ని కూనీ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు తెలపాలని అన్నారు. నూతన విద్యా విధానం పేరుతో పేద విద్యార్థులకు విద్య లేకుండా చేసే విధానం సరైంది కాదని, కేంద్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం వంత పాడడం సరైనది కాదని అన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాములు సన్యాసిరావు, చిన్నయ్య, జట్ల జగన్ పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న రాజన్నదొర

తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే తల్లిదండ్రుల కోరికలను నెరవేర్చాల్సిన బాధ్యత పిల్లలకు ఉందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని శ్రీ కోదండరామ కల్యాణమండపంలో నాలుగు మండలాల పరిధిలో గల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కింద నగదు పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు. గిరిజన సంక్షేమ శాఖ డిడి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజన్నదొర మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత విద్య లక్ష్యంగా చేసుకుని చదువుకోవాలని కోరారు. టిడిపి హయాంలో రూ.35వేలకే ఫీజు రీయింబర్స్మెంట్ పథకం పరిమితం చేయడంతో పేద మధ్యతరగతి విద్యార్థులపై భారం పడిందని చెప్పారు. కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తున్న వైసిపి ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని రాజన్నదొర కోరారు.

అలరించిన బాలికల నృత్యం

జగనన్న విద్యా దీవెన పంపిణీ కార్యక్రమంలో భాగంగా కొత్తవలస, కురుకుట్టి గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కేరింతలు కొట్టారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర వారిని అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్లు వంగపండు అప్పల నాయుడు, జర్జాపు దీప్తి, మక్కువ మండలం వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, లింగాల దుర్గా, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.పార్వతి,ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజన గిడ్డంగి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గిడ్డంగుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు గురువారం శంకు స్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బెలగాంలోని 16 వార్డులో రూ.40 లక్షలతో బహుళ ప్రయోజన గిడ్డంగిని నిర్మిస్తున్నామన్నారు. రైతులు పండించే పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గిడ్డంగులను నిర్మించి వారు పంటను భద్ర పరుచుకునేందుకు నియోజకవర్గంలోని రైతులంతా వినియోగిం చుకోవాలన్నారు. ఇప్పటికే మార్కెట్ యార్డులో ఏగ్రీ ల్యాబ్‌ను నిర్మించామని, మరికొద్ది రోజుల్లోనే అది రైతులకు ప్రారంభించనుందని తెలిపారు. అంతేకా వచ్చే ఏడాది నుంచి పిఎసిఎస్‌లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకునే సామర్థ్యం కూడా పెంపొందించడం జరుగుతుందని, ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, స్థానిక వార్డు కౌన్సిలర్ ఎస్ లక్ష్మీపార్వతి, ఎఎంసి వైస్ చైర్మన్ వి.శంకరరావు, పిఎసిఎస్ కార్యదర్శి ఎస్.నారాయణ రావు, చైర్మన్లు తెర్లి రామస్వామి, జి.దామోదరరావు, వార్డు కౌన్సిలర్ ఆర్.చిన్ననాయుడు, స్టేట్ డైరెక్టర్ సిహెచ్ వెంకట రమణ, వైసిపి సీనియర్ నాయకులు జి.వెంకట రమణ, బి.ఆదినారాయణ, ఎంటి నాయుడు, సందీప్‌కుమార్, అధికారులు, గుత్తేదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

3న ఐటిఐలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 3న గ్రీన్ టెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వారు ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టివి గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ (మెకానికల్/ ఎలక్ట్రికల్) పాస్ అయిన వారు అర్హులన్నారు. అర్హులైన వారు 18 నుంచి 30 వయస్సు కలిగిన పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. కంపెనీ ప్రాంగణంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కాగలరు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 6304033963, 9948582309 సంప్రదించాలని సూచించారు.

రైతులకు బోరులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

వైఎస్‌ఆర్ జలకల పథకం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు బోరు మంజూరు చేసి విద్యుత్ కలెక్షన్ ఉచితంగా ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కొమరాడలో రైతు సంఘం నాయకులు సింహాచలం మధుసూదన్ రావు సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి విలేకరులతో మాట్లాడారు. వైఎస్‌ఆర్ జలకళ పథకం కోసం మండలానికి 200మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, నేటికీ ఒక్క రైతుకు ఈ పథకం అమలు చేయలేదన్నారు. కురుపాం నియోజకవర్గంలో ఒకే ఒక్క వ్యవసాయ పంపు బోరును ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శంకుస్థాపన చేయడం జరిగిందని తప్ప మిగతా మండలంలో ఎక్కడా మంజూరు కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులకు వైఎస్‌ఆర్ జలకళ పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు బోర్లు, ఉచిత విద్యుత్ కనక్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

పార్వతీపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి కలెక్టరేట్
ఎయిడ్స్ రహిత సమాజం మన లక్ష్యం కావాలని ఎయిడ్స్ నివారణ నోడల్ అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సాన్ని గురువారం ఎయిడ్స్ నివారణ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జిఒ హోంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ధవళ భాస్కరరావు మాట్లాడుతూ ఈ ఏడాది సమానత్వం నినాదంతో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎయిడ్స్ పట్ల అవగాహన అవసరమని, భయపడాల్సిన పనిలేదని ఆయన పేర్కొన్నారు. ఆధునాతన చికిత్స అందుబాటులో ఉందని, వైద్యుల సూచన సలహాల మేరకు మందులు, ఆహారం తీసుకోవడం వలన దీర్ఘకాల జీవితాన్ని పొందవచ్చని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వామ్యమై ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 4 సమగ్ర సలహా మరియు ఐసిటిసి కేంద్రాలు, 41 సమీకృత ఐసిటిసిలు, 2 సుఖ వ్యాధుల చికిత్సా కేంద్రాలు తదితర సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో కళాజాత బందాల ద్వారా ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సిడి కల్యాణి, ఐసిడిఎస్ పీడీ జి.వరహాలు,న్యాయవాది టి.పి.జోగారావు మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్ ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తూ కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణకు కషి చేస్తున్న వైద్యులు, సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సర్టిఫికేట్, జ్ఞాపికలను అందజేశారు. ఎయిడ్స్ నివారణ ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో డిహెచ్‌సిఒ బి.వాగ్దేవి, డిపిఆర్ఒ లోచర్ల రమేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన రావు, ప్రోగ్రాం అధికారి డా.వినోద్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి ఎం.కృష్ణవేణి, ఐసిడిఎస్ పిఒ కె.విజయ గౌరి, వైద్య సిబ్బంది యోగేశ్వరరెడ్డి, ఎన్‌జిఒ నాయకులు కిషోర్, సిబ్బంది, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్నవరం పిహెచ్‌సిలో జరిగిన అవగాహనా సదస్సునుద్దేశించి వైద్యాధికారి సత్యవతి మాట్లాడారు. ఎయిడ్స్ పై ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎయిడ్స్ ఉన్న గర్భిణులను గుర్తించి బిడ్డలకు ఎయిడ్స్ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకొంటున్నట్లు వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. జనార్ధన్ నాయుడు అధ్యక్షతన ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.ప్రభాకరరావు, పాలకొండ ఏరియా ఆసుపత్రి ఎయిడ్స్ కంట్రోల్ కౌన్సిలర్ జి.శ్రీహరినాయుడు, అర్చన, బి. రాజు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల విద్యార్థిని విద్యార్థులు భారీగా ర్యాలీగా ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు.

ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ

పాచిపెంట : స్థానిక పిహెచ్ సి వైద్యాధికారి గంటా వెంకటరమణ ఆధ్వర్యంలో పాచిపెంటలో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డాక్టర్ రవిచంద్రన్. సి హెచ్ఒ జి.శోభారాణి. ఏయినములు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీతానగరంలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

పాచిపెంటలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా తాడికొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పలు నినాదాలు విద్యార్థులతో చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సింహాచలం, తాడికొండ పిహెచ్సి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఎన్. రత్న ప్రసాద్, ఎస్ వి ప్రకాష్, బి. లక్ష్మణ, హెల్త్ ఎడ్యుకేటర్, ఎం. ప్రభావతి, అర్చన, ఎం ఎల్ హెచ్ పీ లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక పిహెచ్‌సి నుంచి మెయిన్ బస్టాండ్ వరకు వెళ్లి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టరులు శిరీష, ఉషా, తహశీల్దార్ ఎంవి రమణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రేణుక, వైద్యాధికారి శిరీష, ఎన్ఎస్ఎస్ పిఒ, పోలీసు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వారపు సంతలో..

కురుపాం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక వారపుసంతలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చీకటి శంక[illegible] మండంగి సత్యమ్మ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండలో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పాలకొండలో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కొమరాడ: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాల విద్యార్థుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రిన్సిపల్ రజని ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ర్యాలీలో గురుకులం ఎన్ఎస్ఎస్ పిఒ కె.పాప, హెల్త్ సూపర్ వైజర్ సిహెచ్ స్వర్ణలత, బోధనా సిబ్బంది, గురుకులం విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎల్విన్ పేటలో మానవహారం చేపట్టారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ పెద రామకష్ణ, బి త్రినాధరావు ఉన్నారు.

పాలకొండ: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు లో ఎయిడ్స్ వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాచర్ల కుమారస్వామి జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు శివానంద శ్రీనివాసరావు, విజయ్ రాజు, మాణిక్ రాజు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

డిటికి వినతిని అందజేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇందిర

ఇంటి పనివారల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం రూరల్ : ఇంటి పనివారల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. జాతీయ ఇంటి పనివారి డిమాండ్స్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అసంఘటితరంగా ఉన్న ఇంటి పని వాళ్ళ సంక్షేమానికి జాతీయస్థాయిలో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో పట్టణంతోపాటు మండలానికి చెందిన పనివారల సంఘం నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బలిజిపేట : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు పైల సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వైసిపి ప్రభుత్వం చాలా అన్యాయం చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించి ఆరు రంగాలకు కేటాయించిందని, వీరి సంక్షేమ బోర్డు క్లైములు పరిష్కారం చేయడం లేదని, భవన నిర్మాణ కార్మికులకు ఎటువంటి భరోసా రాష్ట్ర ప్రభుత్వం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు సిహెచ్ సుబ్బయ్య, సులక మజ్జి, కైలాసం, మురళి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ

సీతంపేట : మండలంలో దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు కొండగొర్రి సుబ్బారావు ఎయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఐరన్ మాత్రలు ప్రాముఖ్య గురించి తెలియజేశారు వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ వి ఉత్తర్రావు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

ఐక్యపోరాటాలకి సిద్ధం కావాలి : సిఐటియు

సీతానగరం : సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఐక్యపోరాటాలకి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక గాయత్రీ కాలేజీ ఆవరణలో సిఐటియు మండల మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను పూర్తిగా రద్దుచేసి వారి హక్కులను హరించిందని విమర్శించారు. కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేయడం, జీత భత్యాలకు బేరమాడే శక్తి లేకుండా చేయడం బిజెపి ప్రభుత్వ విధానమని విమర్శించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు వి.రామలక్ష్మి, కార్యదర్శిగా జి.వెంకటరమణ, మరో 15మందితో సమన్వయ కమిటీ ఏర్పాటైంది. సభలో అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొన్నారు.

రైతులు అపోహలు వీడాలి

వీరఘట్టం : రైతులు అపోహలు విడనాడాలని స్థానిక వ్యవసాయ అధికారి కె.మన్మథరావు అన్నారు. గురువారం మండలం తెట్టంగిలోకొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాలకు లోడ్ చేస్తుండగా పరిశీలించారు. మండలంలో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

వీరఘట్టం : మండలం నడుకూరుకు చెందిన గురుబిల్లి సుజాత అదృశ్యమైనట్టు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. సుజాత భర్త గురుబిల్లి శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శివ గత నెల 22న శబరిమల పెళ్లినాడని అదే నెల 26న తన భార్య సుజాత, ఇద్దరు కుమారులు అదృశ్యమైనట్లు శివ ఫిర్యాదు చేశారు.

గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ ఉషారాణి

గాంధీ విగ్రహావిష్కరణ

వీరఘట్టం : మహనీయుడు మహాత్మాగాంధీ అని సర్పంచి వావిలపల్లి ఉషారాణి అన్నారు. మండలంలోని దశమంతపురంలో మహాత్మా గాంధీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తెచ్చేందుకు మహాత్మా గాంధీ ఎనలేని కృషి చేశారని, ఆయన్ను ప్రతిరోజూ స్మరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వావిలపల్లి హరిబాబు, సన్యాసినాయుడు, సచివాలయ కార్యదర్శి ఎస్.సునీల్ కుమార్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్
ప్రజలంతా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణరావు అన్నారు. గురువారం గోపాలపురంలో మండల న్యాయసేవాసమితి ఆధ్వర్యంలో న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పౌరులు ప్రాథమిక హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం పొందే హక్కు ఉందని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వమే న్యాయ సహాయం అందిస్తుందని అన్నారు. అనంతరం ప్రజలకు పలుచోట్ల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు టి.జోగారావు, గొర్లె వెంకటరావు, సర్పంచ్ రామోలు రాములమ్మ రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కురుపాం : ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన కలిగి మంచి చదువుతోపాటు న్యాయవ్యవస్థ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనికురుపాం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఇ.అంజనేయులు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులకు న్యాయవ్యవస్థ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాలు సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విద్యార్థి దశ నుంచే చట్టాలు న్యాయవ్యవస్థపై అవగాహన ఉండాలని ఆదేశాలతో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నామని ఇవన్నీ సక్రమంగా విని మీ గ్రామాల్లో మీరు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు అంధవరపు కోటేశ్వరరావు, గొటారి వెంకట్రావు కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణరావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

కురుపాం : జగనన్న లేఔట్ లో పేదలకు ఇచ్చిన స్థలాల్లో త్వరితగతిగా పనులు ప్రారంభించాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. గురువారం స్థానిక ఐకెపి కార్యాలయం వద్ద హౌసింగ్ ఎఇ జి.అచ్చమ్మ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈనెలాఖరులోగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ పి.మోహనరావు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, జెడ్‌పిటిసి జి.సుజాత, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, స్థానిక సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసిలు వి.బంగారు నాయుడు, టివిఎస్ స్వామియోజులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులు డిశంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపిడిఒ అకిబ్‌జావేద్ అన్నారు. గురువారం ఆయన హౌసింగ్ అధికారులు, ఇంజనీరు అసిస్టెంట్‌లతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు 50శాతం పూర్తిచేసుకుని మిగతా మండలాలకు ఆదర్శంగా నిలిచామని, అందుకు సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులు కృషి ఉందని కొనియాడారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ నెలాఖరులో లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు.

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సాలూరురూరల్
ఈనెల 8,9,10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరగనున్న ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మహాసభల గోడపత్రికను స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు అండగా నిలిచిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. రెండు పూటలా పనిచేయాలనే నిబంధనలతో కూలీలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు పూటలు పనిచేసినా కూలి గిట్టుబాటు కావడంలేదన్నారు. అలాగే పనిచేసే నెలలు గడుస్తున్నా కూలి అందడంలేదన్నారు. వ్యవసాయంలో పనిదినాలు తగ్గిపోయి వనలకు సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, వ్యవసాయ కార్మికులకు భూ పంపిణీ చేయాలని కోరారు. ఈ సమస్యలన్నింటిని మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు తాడంగి గాసి, చింత లక్ష్మి, అప్పలస్వామి, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు

అన్నవరంలో గడపగడపకు...

ప్రజాశక్తి - పాలకొండ రూరల్
మండలంలోని అంపిలి గ్రామ సచివాలయ పరిధిలో అన్నవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్య ప్రకాశరావు, వాకముడి అనిల్ కుమార్, సర్పంచ్‌లు లోలుగు విశ్వేశ్వరరావు, గవర రాజశేఖర్, పిఎసిఎస్ అధ్యక్షులు లోలుగు నారాయణరావు, చింత సంగంనాయుడు, బూరాడ తేజేశ్వరరావు, గవర దుర్గారావు, గవర గురునాధరావు, గవర ప్రసాదరావు, వారాడ దుర్గారావు, మడపల ప్రసాదరావు, పాండ్రంకి మురళీకష్ణ, నెల్లి శివప్రసాద్, గొర్లి కృష్ణారావు, వావిలపల్లి రాజారావు, సివ్వాల శ్రీనివాసరావు, సిర్లపు గురువినాయుడు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అక్కడ నాడు- నేడు కార్యక్రమం ద్వారా అభివద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడ పిల్లలకు అందుతున్న భోజన, ఇతర మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి అక్కడి పిల్లలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పలకలు, పుస్తకాలు అందించారు. అన్నవరం గ్రామస్తుల దీర్ఘకాల సమస్యగా మారిన వరద రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. నాగావళి నది తీరంలో 150 మీటర్ల ఫ్లెడ్ వాల్ ఆవశ్యకత సీఎం దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

పాచిపెంట : మండలంలోని పాంచాలి పంచాయతీ జీలికవలస, పాంచాలి తదితర గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం పి.రాజన్న దొర ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ ప్రభుత్వ పథకాలు వివరించారు. సమస్యలుంటే తెలియజేయాలని తక్షణమే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపిపి, ఎమ్మెల్సీ

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని రాయగడ జమ్మూ సచివాలయం పరిధిలో గల గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. జగనన్న నిరుపేద గిరిజనులకు పక్కా గహాలు మంజూరు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి కె.దీనమయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, జెడ్‌పిటిసి సభ్యులు రాధిక, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న టిడిపి నాయకులు

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం
మండలంలోని గుజ్జువాయి, పెదగొత్తిలి, గుమ్మ, మొండెఖల్, నీలకంఠాపురం పంచాయతీల పరిధిలో గల పిటిజిలకు ఓటు హక్కుపై స్థానిక తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ గురువారం అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గరుడ యాప్ గూర్చి బిఎల్ఒలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలకంఠాపురం సచివాలయ సందర్శన సమయంలో 11గంటలైనా సచివాలయం తెరుచుకోలేదని సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : గిరిజన ప్రాంతం లో నివాసం ఉంటున్న సవర, గదబ ప్రజలు ఓటు నమోదు చేయించుకోవాలని స్థానిక తహశీల్దార్ జె.రాములమ్మ కోరారు. మండలంలోని ఎస్కే పాడు, కన్నయ్యగూడ, జెకెపాడు తదితర గ్రామాల్లో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు.. ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేయించుకుని ప్రభుత్వ పథకాలకు అర్హులుగా ఉండాలన్నారు. ఓటును కలిగి ఉంటేనే అన్ని విధాలా ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో డిటి ఎం.రాజేంద్ర, విఆర్ఒలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేదారిపురంలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం
రాష్ట్రంలో వైసిపి అరాచకపాలన పోవాలంటే టిడిపికి అండగా ఉండి అఖండ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు కోరారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన కేదారిపురంలో ఇదేంకర్మ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయరామరాజు పాల్గొని మాట్లాడుతూ వైసిపి మూడున్నర ఏళ్ల పాలనలో నిత్యవసర ధరలు పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇదేమి కర్మ అంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపికి ప్రజలంతా పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. గిరిజన ఆడపడుచు తోయక జగదీశ్వరిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఇంచార్జి జగదీశ్వరి మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం మళ్లీ టిడిపి అధికారంలోకి రావాలన్నారు. కేదారి పురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ మండల కన్వీనర్ల శేఖర్ పాత్రుడు, అక్కేన మధు, పల్లా రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నాయకులు కడ్రక కళావతి, వెంకటాపు భారతి, గురాన శ్రీరామ్మూర్తి, అక్కేన మధుసూదన్ రావు, టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పంచగవ్యతో జీడి అధిక దిగుబడి

ప్రజాశక్తి - పాచిపెంట
పంచగవ్యను పిందె దశ నుంచి కనీసం మూడుసార్లు పిచికారీ చేసుకుంటే జీడి తోటల్లో జీడిపిక్కల దిగుబడి 25 శాతం పెరుగుతుందని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని బొబ్బిలివలసలో మర్రి చిన్నమ్మి మహిళా రైతు గత ఐదేళ్లుగా పంచగవ్యను జీడి తోటకు వాడుతున్నానని ప్రతి ఏటా దిగుబడి పెరుగుతూ వస్తుందని అన్నారు. నాలుగు, ఐదు కిలోలు మాత్రమే జీడిపిక్కల దిగుబడి వచ్చేదని గతేడాది 12 కిలోల ఒక్క చెట్టుకు దిగుబడి వచ్చిందని తెలిపారు. అంతేకాక పంచగవ్య వాడిన చెట్ల నుంచి పిక్క తయారైన తర్వాత జీడి పండు రాలిపోతుందని, ప్రత్యేకంగా కొమ్మలు కదపడం పళ్ల చేరడం వంటివి చేయనవసరం లేదని తెలిపారు. ఈ మహిళా రైతును ఆదర్శంగా తీసుకుని తుమ్మలపాటి చిన్నయ్య, జట్ల త్రినాథ్, బి.పరమేశు రైతు కూడా ముందుకు వచ్చి పంచగవ్యను తయారు చేశారు. కార్యక్రమంలో ఎపిసిఎంఎఫ్ ప్రతినిధులు యశోద, ఐసిఆర్‌పి విజయ్, సిఆర్‌పి తిరుపతి నాయుడు, విఎఎ మోహన్‌కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులుగా పాపారావు

సీతంపేట: పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులుగా వై పాపారావు ఎన్నుకోబడ్డారు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ ఎన్నికను ఎంపిడిఒ కె.గీతాంజలి, ఇఒపిఆర్‌డి కె.సత్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా ప్రవీణ్ కూమార్, ప్రధాన కార్యదర్శిగా వినోద్, మహిళ అధ్యక్షులుగా రాజేశ్వరి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి అభినందించారు.

పిఎంజెఎవై ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్
ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఆయుష్మాన్ భారత్) ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు వార్డు సచివాలయాల సెక్రెటరీలకు, వాలంటీర్లకు సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ పరిధిలో ఉన్న పలు సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు కృషి చేస్తున్నాయని, మీమీ సచివాలయాల పరిధిలో ఈ ప్రక్రియకు సంబంధించి లబ్ధిదారులకు ఇకెవైసి చేయాలని, లక్ష్యాలను పూర్తి చేసి కార్డులను డౌన్లోడ్ చేసుకోవాలని, విధులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని అన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్
బిటి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించి సకాలంలో పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు కాంట్రాక్టర్లను ఆదేశించారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద జరుగుతున్న బిటి రోడ్డు నిర్మాణం పనులను గురువారం ఎమ్మెల్యే స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన రోడ్డు నిర్మాణం సకాలంలో పూర్తి చేసి వాహనాలకు, పట్టణ వాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే గుత్తేదారులకు ఆదేశించారు. ఈ సందర్శనలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీస్వరి, పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు ఆర్.చిన్నం నాయుడు, ఎన్ సుధీర్ కుమార్, కోరాడ శ్రీనివాసరావు (నాని), మజ్జి శశిఖర్, స్టేట్ డైరెక్టర్ వెంకటరమణ, వైసిపి నాయకులు బి.ఆది నారాయణ, ఎస్‌వి‌ఎస్‌ఎన్ రెడ్డి, గొర్లి మాధవరావు, పాలవలస శ్రీనివాసరావు, ఎంటి నాయుడు, కార్యకర్తలు, గుత్తేదారులు, అధికారులు పాల్గొన్నారు.

4న జాబ్‌మేళా

పాలకొండ: ఈనెల 4 స్థానిక శ్రీ సత్యసాయి డిగ్రీ కాలేజ్ లో జిఎంఆర్ రక్ష సెక్యూరిటీసర్వీసెస్ వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిఎంఆర్ సంస్థ మేనేజర్ అగ్గాల హనుమంత రావు తెలిపారు. సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలు కోసం జాబ్ మేళా పెట్టడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ అనంతరం జాబ్ ఎంఎన్‌సి, ఎయిర్పోర్ట్ లలో ఉంటుందని అలాగే ఈ ట్రైనింగ్ గవర్నమెంట్ ఉద్యోగాల కోసం (పోలీసు, ఆర్మీ, నావి, ఎయిర్ ఫోర్స్, పారా మిలిటరీ) ప్రయత్నిస్తున్న అభ్యర్థులకు ఉపయోగపడుతుందన్నారు. ఎత్తు 166 సె మీ,10 వ తరగతి పాస్,ఆధార్ జిరాక్స్, 18 ఏళ్ల నుంచి 35లోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 8328619287, 9573043507 నంబర్లను సంప్రదించాలన్నారు.